తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
మంగళవారం
03 డిసెంబర్ 2024
పేజీలు : 08
Follow :

## జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

### ఎస్పీ యోగేష్ గౌతమ్



**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):**
జిల్లా వ్యాప్తంగా పోలీస్ 30 యాక్ట్ అమలులో ఉందని జిల్లా ఎస్పి యోగేష్ గౌతం తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, సమావేశాలు, బహిరంగ సభలు నిర్వహించరాదని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా నారాయ ణపేట జిల్లా వ్యాప్తంగా ఈ నెల రోజుల పాటు "30 పోలీస్ ఆక్ట్" అమల్లో ఉంటుందని ఎస్పీ తెలిపారు. 30 పోలీస్ ఆక్ట్ ఈ నెల 31 వరకు అమల్లో ఉన్నందున జిల్లాలో పోలీసు అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావే శాలు, ఊరేగింపులు, ధర్నా లు, ఫంక్షన్ హాల్లో కార్యక్ర మాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమ్మిగుడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. అనుమతులు లేకుండా పై కార్యక్రమాలు నిర్వహించిన నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించేందుకు దారి తీసే సమావేశాలు, జన సమూ హం చేయడం పూర్తిగా నిషేధ మని తెలిపారు. సోషల్ మీడి యా నందు అనవసరమైన విషయాలను, మతాల మధ్య చిచ్చు పెట్టే అంశాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులను నమోదు చేయబడతాయని తెలిపారు. చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం శిక్ష అర్హులవుతారని తెలిపారు. నిషేధంలో ఉన్న నిబంధనలు తప్పనిసరిగా అందరూ పాటించాలని ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తు దరఖాస్తు చేసుకునే అనుమతులు తీసుకోవాలని ఎస్పి కోరారు.

## ఆహార నాణ్యతలో రాజీ పడొద్దు

- **మెనూ ప్రకారం విద్యార్థులకు మంచి ఆహారాన్ని అందించాలి**
- **జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి**



**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**
హాస్టల్ గదులు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలనిన జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయం పక్కన ఉన్న ప్రభుత్వ కళాశాల బాలికల వసతి గృహన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. స్టోర్ రూంను పరిశీలించారు. స్టోర్ రూం, వసతి గృహం గదులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థినిలతో కలిసి కలెక్టర్ రాత్రి భోజనం చేశారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. భోజనం, ఆహార నాణ్యతలో రాజీ పడవద్దని, ఎటువంటి సమస్య ఉన్న అధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు. వసతి గృహం గదుల ఫ్లోరింగ్ మరమ్మతులకు నిధులు మంజూరు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట వసతి గృహం సంక్షేమ అధికారి మాధవి ఉన్నారు.

## పాఠశాల..'అభివృద్ధికి మేము సైతం'..!

### మిర్జాపూర్ (బి)లో అలరించిన ఆత్మీయ సమ్మేళనం..!



**న్యాల్ కల్, డిసెంబర్ 02, (జనం సాక్షి) :**
న్యాల్ కల్ మండలంలోని మిర్జాపూర్ (బి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభ్యున్నతికి తమ వంతుగా కృషి చేస్తామని పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు ప్రకటి ంచారు. సోమవారం 2005 /2006 విద్యా సంవత్సరానికి గాను 10 తరగతి పూర్వ విద్యా ర్థులు ఆత్మీయ సమ్మేళన కార్య క్రమాన్ని చేపట్టారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజ్ కుమా ర్ అధ్యక్షతన ముఖ్య అతిథిగా మం డల విద్యాధికారి మారుతి రాథోడ్ హాజర య్యారు. ఉదయం నుండి సాయంత్రం వరకు నిర్వహించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మే ళన కార్యక్రమం ఎంతో అలరించింది. 9లో..

## వైభవంగా పడమటి అంజన్న బ్రహ్మోత్సవాలు



- **కురుమూర్తి, మన్యంకొండ తరహాలో ఏర్పాట్లు**
- **సీఎం రేవంత్, మంత్రి కొండా సురేఖలకు ఆహ్వానం**
- **మఖ్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి**

**మక్తల్ డిసెంబర్ 02 (జనంసాక్షి)**
మఖ్తల్ పడమటి ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలను గతంలో ఎన్నడూ లేనంత అంగరంగ వైభవంగా, కురుమూర్తి, మన్యంకొండ జాతర ఉత్సవాల తరహాలో నిర్వహిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. ఆలయ ధర్మకర్త ప్రాణేశాచారి, ఈవో శ్యాంసుందరాచారి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతర సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈనెల 13 నుంచి 19వరకు ఉత్సవాలు జరగనుండగా...14వ తేదీ ప్రభోత్సవం, 15న రథోత్సవం, 16న పాల ఉట్లు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఉత్సవాల పోస్టర్లు, కరపత్రాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... మఖ్తల్ నలుమూలలా ఉత్సవాల స్వాగత తోరణాలను ఏర్పాటు చేసుకుందామని సూచించారు. మినీ ట్యాంక్ బండ్ నుంచి స్పెషల్ లైటింగ్, ఆంజనేయ స్వామి కటౌట్లు ఏర్పాటు చేయాలని అన్నారు. జాతర ఉత్సవాల్లో పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించాలని సూచించారు. మున్సిపాలిటీ పారిశుద్ధ్యం కోసం ఉత్సవాల కోసం తాత్కాలికంగా సిబ్బందిని నియమించుకోవాలని అన్నారు. 9లో..

## స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లను పెంచాలి

**బీసీ డెడికేటెడ్ కమిషన్‌కు కల్లుగీత కార్మిక సంఘం వినతి**

**సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 2 (జనం సాక్షి)**



గౌడ జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేసి, రాజకీయ, ఉపాధి అవకాశాలు కల్పి ంచాలని బీసీ డెడికేటెడ్ కమిషన్ అధ్యక్షులు భూసాని వెంకటేశ్వర్లుకు కల్లుగీత కార్మిక సంఘం వినతి పత్రం అందజేశారు. సంగారెడ్డి జిల్లాకు వచ్చిన సందర్భంగా తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సంగారెడ్డి లోని జిల్లాపరిషత్ మీటింగ్ హాల్‌లో కలిశారు. ఈ సందర్భంగా గౌడ జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేసి, రాజకీయ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. బీసీ కార్పొరేషన్ ద్వారా రిజిస్టర్ చేసుకున్న సొసైటీలకు సబ్సిడీ రుణాలు మంజూరు చేసి గౌడ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. నాయకులు యాదగౌడ్ నరేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మైత్రి ట్రాన్స్ క్లినిక్ ఏర్పాటు చేయడం హర్షనియం

### సంగారెడ్డి ఆసుపత్రిలో మైత్రి ట్రాన్స్ క్లినిక్ ఏర్పాటు



### జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

**సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 2(జనంసాక్షి)**
ట్రాన్స్ జెండర్‌ల ఆరోగ్య సమస్యల పరిష్కారం కోసం మైత్రి ట్రాన్స్ క్లినిక్లు ఏర్పాటు చేయడం అర్షించదగ్గ విషయమని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కాలం పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల లో భాగంగా సోమవారం ఆరోగ్య దినోత్సవం కార్యక్రమం ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, హైదరాబాద్ నుండి వర్చువల్ విధానం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా నర్సింగ్ కాలేజీలు, ట్రాన్స్ జెండర్ క్లినిక్‌లు ప్రారంభించిన సందర్భంగా సంగారెడ్డి మెడికల్ కళాశాల నుండి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు పాల్గొన్నారు. సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మైత్రి ట్రాన్స్ క్లినిక్ (ట్రాన్స్ జెండర్ క్లినిక్)ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ట్రాన్స్ క్లినిక్ పేరుతో ట్రాన్స్ జెండర్ క్లినిక్‌ను ప్రారంభించడం జరిగింది. ట్రాంజెండర్స్‌కు వైద్య సేవలు ఎప్పటికీ అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రతి గురువారం ఓపి సేవలు వారికి అందుబాటులో ఉంటాయని, 9లో..



## ఎస్సీ వర్గీకరణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి

### ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నేత చింతబాబు

**చారకొండ, డిసెంబర్ 2 (జనంసాక్షి)**
ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఎమార్పీఎస్ రాష్ట్ర నేత చింతబాబు, జిల్లా ఇన్ ఛార్జ్ యాదగిరి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఎస్సీ వర్గీకరణ వెంటనే చేపట్టాలని అన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న ఆధ్వర్యంలో త్వరలో మాదిగల మహాగర్జన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల నాయకులు విజయ్, కృష్ణయ్య, కొండల్, జంతుక యాదగిరి, శ్రీను, కొమ్ము యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# గీతం స్కాలర్ మంగపతికి డాక్టరేట్

పటాన్చెరు డిసెంబర్ 2(జనంసాక్షి)

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ లోని గణిత శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి మంగపతి నేరుకొండ డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'వివిధ రకాల మెట్రిక్ స్పేస్‌లలో అప్లికేషన్‌లతో స్థిర పాయింట్ సొల్యూషన్స్ పై ఒక అధ్యయనం' అనే అంశంపై సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లోని గణిత శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.రామకోటేశ్వరరావు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. మంగపతి పరిశోధన గణిత విశ్లేషణ, కంప్యూటర్ సైన్స్, అనువర్తిత గణితంలో గణనీయమైన ప్రాముఖ్యతను కలిగి ఉన్న స్థిర-పాయింట్ సిద్ధాంతం యొక్క కీలకమైన రంగాన్ని



పరిశీలించిందని పేర్కొన్నారు. ఆయన విస్తృత శోధన స్థిర-పాయింట్ పరిష్కాలను నిర్ణయించ డానికి వినూత్న పద్ధతులను పరిచయం చేసిందని, విభిన్న మెట్రిక్ ప్రదేశాలలో వాటి వినియోగాన్ని అన్వేషించిందని తెలిపారు. ఈ సిద్ధాంత వ్యాసం, స్థిర-పాయింట్ సొల్యూషన్స్‌పై అవగాహన పెంచడమే కాకుండా వాస్తవ-ప్రపంచ సమస్యలకు వర్తించే ఆచరణాత్మక అంతర్దృష్టులను కూడా అందిస్తుందోన్నారు. ఇది సమగ్ర సమీకరణాలు, హోమోటోపీ సమస్యలతో సహా స్థిర-పాయింట్ సిద్ధాంతం యొక్క అనువర్తనాలను పరిష్కరించడానికి ఒక నూతన విధానాన్ని అందిస్తుందని తెలిపారు. మంగపతి సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ఇన్ ఛార్జి ప్రిన్సిపాల్, గణిత శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ మోతహర్ రెజా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పలువురు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



## మద్దూరు విశ్వభారతి స్కూల్ విజయభేరి

మద్దూరు డిసెంబర్ 2 (జనంసాక్షి)

మద్దూరు మండల కేంద్రంలో విశ్వభారతి స్కూల్ స్థాపించిన కొద్ది రోజుల్లోనే ప్రతి రంగంలోనూ విద్యార్థులు ప్రభంజనం సృష్టిస్తున్నారు. ఆదివారం రోజు ఉమ్మడి పాలమూరు జిల్లా విశ్వహిందూ పరిషత్ వారు నిర్వహించిన భగవద్గీత శ్లోకాలు కాంపిటీషన్‌లో ప్రథమ బహుమతి సాధించారు. పాఠశాల కరస్పాండెంట్ కె.తిరుపతి రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే విశ్వభారతికి ప్రథమ బహుమతి రావడం మన విశ్వభారతి బంధువులకు గర్వకారణం. మన విశ్వభారతి ఆణిముత్యం రాష్ట్ర స్థాయికి ఎన్నిక కావడం ఎంతో ఆనందదాయకం. మద్దూరు మండల కీర్తి కిరీటాన్ని ఉమ్మడి పాలమూరు బంధుజనానికి చూపించిన ఘనత చిన్నారి ధన్యారెడ్డి విశ్వ భారతి విజేత. మన పాఠశాల నుండి మండల స్థాయిలో ఎన్నికైన ముగ్గురిలో ఒకరు ప్రథమ స్థాయి బహుమతి, మయూరి మరియు అరవింద్ గౌడ్‌కి ప్రశంశా పత్రాలు లభించాయి. ఆదివారం రోజు మద్దూరు మండల స్థాయిలో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో అయిదు గురు మండల విద్యాధికారి ద్వారా ప్రశంశా పత్రాలు అందుకున్నారు. వినీత ఎనిమిదవ తరగతి, నందిని, విష్ణు, జశ్వంత్ రెడ్డి, గోవింద్ నాయక్ తొమ్మిదవ తరగతి, ఎల్లప్పుడు మద్దూర్ మండల ప్రజల మరియు మా విద్యార్థుల తల్లిదండ్రుల దీవెనలు ఆశీస్సులు మా విశ్వభారతిపై ఉండాలనీ కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కె. తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ పి. జయపాల్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కె. జ్యోతి రెడ్డి, మరియు ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



## బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ద్వారా ఋణాలు తీసుకుని దుకాణాలు తెరవకుండానే స్వాహా

ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన సామాజిక కార్యకర్త రాజశేఖర్ శర్మ

నాగర్ కర్నూల్, ఆర్సీ, డిసెంబర్ 2(జనంసాక్షి):

గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు బెస్ట్ స్కీం ద్వారా నాగర్ కర్నూల్ పట్టణంలో మంజూరైన ఋణాలలో కొంతమంది లబ్ధిదారుల నిధులు దుర్వినియోగమయ్యాయని సోమవారం ప్రజావాణిలో సామాజిక కార్యకర్త వి.రాజశేఖర్ శర్మ ఫిర్యాదు చేశారు. బీద బ్రాహ్మణులకు స్వయం ఉపాధిని కల్పించే విధంగా మరియు వ్యాపార, పారిశ్రామిక రంగాలలో రాణించేలా ఆర్థిక చేయూత నిచ్చే పథకం బెస్ట్ స్కీంలో అక్రమాలు జరిగాయని, కొంతమంది ధనిక బ్రాహ్మణులు సంక్షేమ పరిషత్తు బెస్ట్ స్కీం ద్వారా లక్షల రూపాయలలోన్ డబ్బులు తెచ్చుకొని వ్యాపార దుకాణాలు తెరవకుండానే ప్రభుత్వాన్ని మోసం చేశారని, గతంలో ఇట్టి అక్రమాలపై బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు బోర్డు సభ్యులు జ్యోషి గోపాల్ శర్మ కి ముఖాముఖిగా ఫిర్యాదు చేయగా వెంటనే బోగస్ ఎంక్వయిరీ నిర్వహించి ఇంతవరకు చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీద బ్రాహ్మణుల కోసం ఏర్పాటుచేసిన సంక్షేమ పరిషత్తు డబ్బులు చాలా వరకు ధనవంతుల బ్రాహ్మణుల జేబుల్లోకి వెళ్ళాయని, స్వాహా చేసిన వారిపై విచారణ నిర్వహించి చట్టప్రకారంగా చర్యలు తీసుకుంటూ వారి నుండి ఋణాలు రికవరీ చేయాలని కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

# పాఠశాల భవనాల కోసం విద్యార్థుల పాదయాత్ర

వనపర్తి,డిసెంబర్02(జనంసాక్షి):

వనపర్తి జిల్లా పరిధిలోని పాన్ గల్ మండలం, రేమద్దుల గ్రామ జిల్లా పరిషత్ హైస్కూల్ లో తరగతి గదులను నిర్మించాలని కోరుతూ విద్యార్థులు సోమవారం పాదయాత్ర చేపట్టారు. ప్రజాతంత్ర ఉద్యమ నాయకుడు వెంకటయ్య,కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు భగత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.ఆది, డివైఎఫ్ఐ జిల్లా కోకన్వీనర్ మహేష్ జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ అధ్వర్యంలో ప్రారంభమైన ఈ పాదయాత్ర రేమద్దుల, తిరుమలాపురం, మున్ననూరు, అప్పాయపల్లి, వనపర్తి పట్టణ ప్రధాన వీధుల గుండా కొనసాగింది. అనంతరం వనపర్తి జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో వినతి పత్రాన్ని అందజేశారు ఈ సందర్భంగా పలువురు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ రేమద్దుల జెడ్పీహెచ్ఎస్ లో 160 మంది విద్యార్థులు 6 నుండి 10వ తరగతులు చదువుతున్నారని, తెలుగు మీడియం, ఇంగ్లీష్ మీడియం లకు సంబంధించి ఒక్కొక్క గదుల్లోనే తరగతులు నిర్వహిస్తున్నారని అన్నారు. రెండు మాధ్యమాల్లో ఒకే గదిలో విద్యా బోధన జరుగుతున్నదని, దీనివల్ల విద్యార్థులకు పాఠాలు అర్థం అవడం లేదని అన్నారు. పాఠశాలలో అదనపు గదులను మంజూరీ చేయాలని గతంలో అప్పటి ఎమ్మెల్యేను పలుమార్లు కోరామని గుర్తు చేశారు అయితే గత ప్రభుత్వం మనఊరు-మనబడి పథకం కింద చేపట్టిన అదనపు గదులను నాసిరకంగా నిర్మించడంతో అవి వాడుకలోకి రాలేదని అన్నారు. ఈ సంఘటనపై అప్పట్లో చేసిన ఫిర్యాదును పరిశీలించిన అధికారులు అదనపు గదుల నిర్మాణాలను పటిష్టం చేస్తామని హామీ ఇచ్చి ఏడాది దాటినా ఆ పనులను ముట్టుకోలేదని అన్నారు .ఒకటే గదిలో



ఆంగ్లం తెలుగు మీడియాల్లో చేస్తున్న బోధనలు విద్యార్థుల పాలి భారంగా మారాయని, దీనివల్ల పరీక్షల్లో ఫెయిల్ అయే అవకాశాలున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి వెంటనే అదనపు గదులను నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు కుమార్, వెంకటేష్, భరత్, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి కమలాకర్, నాయకులు భాస్కర్ గౌడ్, ఖాజా, మహేష్,ప్రసాద్, లక్ష్మణ్ ,ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతు పక్షపాతి కాంగ్రెస్

### వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీహరి రాజు

శ్రీరంగాపూర్ డిసెంబర్ 2 (జనంసాక్షి)

శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో వరి కొనుగోలు కేంద్రాలను వనపర్తి ఎమ్మెల్యే తుడిమేగా రెడ్డి ఆదేశం మేరకు శ్రీరంగాపూర్ మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రెడ్డిచెర్ల శ్రీహరి రాజు



ఆధ్వర్యంలో సోమవారం రోజున నాగరాల రెండో సెంటర్ మరియు మండల కేంద్రంలోని పలు వడ్ల కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. రైతులతో మాట్లాడుతూ రైతులు ఆరుకాలం కష్టపడి పండించిన పంటను అధికారులు నిర్లక్ష్యం వహించకుండా వెంటనే కొనుగోలు చేసి ప్రభుత్వమునకు మరియు రైతులకు సహకరించాలని ఎక్కడ ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూడాలని రైతులకు అన్ని సదుపాయాలు అందించాలని అలాగే రైతులు టీఆర్ఎస్ నాయకులు పొద్దుపోని మాటలు విని మోసపోవద్దని కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షపాతి అని పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొంటుందని, అలాగే సన్న రకాల వడ్లకు 500 బోనస్ కూడా ఇస్తుందన్నారు. ఇట్టి కార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఆశన్న, పెబ్బేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ శంకర్ యాదవ్ మరియు కాంగ్రెస్ నాయకులు పసుల రాజవర్ధన్, మదనకారి సాయి చందన్, పసుల ఈశ్వరయ్య, గుంటి శివకుమార్, తదితర రైతులు పాల్గొన్నారు.

## యుఎస్ఎఫ్ఐ జాతీయ మహాసభలను విజయవంతం చేయండి

సిద్దిపేట టౌన్ డిసెంబర్ 02 (జనంసాక్షి)

భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ జాతీయ మహాసభలు ఈనెల 14, 15 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలో గల మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో



జరుగుతాయని ఈ మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు విద్యార్థులతో కలిసి బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుడికందుల రవి, చంద్లాపురం మధులు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నూతన విద్య విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చి ప్రభుత్వ విద్యారంగానికి సమానంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యారంగాలకు ప్రాధాన్యత కల్పిస్తూ డబ్బులు ఉన్నవారికి ఒక రకమైన పాఠశాలల్లో, డబ్బులు లేని వారికి ఇంకో రకమైన పాఠశాలల్లో విద్య అందే విధంగా చేయాలని చూస్తున్నారు. ఇప్పటికే దేశంలో 60 శాతం మాత్రమే అక్షరాస్యత ఉంది ఇప్పుడు ఈ నూతన విద్యా విధానంలోకి అమల్లోకి వస్తే అది 30 శాతానికి పడిపోయే ప్రమాదం ఉందన్నారు. ఇతర విద్యారంగ సమస్యల పైన ఈ మహాసభలో చర్చించి రాబోవు రోజుల్లో నిర్వహించబోయే ఉద్యమ కార్యచరణని రూపొందించడం కోసం ఈ మహాసభ వేదిక అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హేమంత్, ప్రకాష్, నరేష్, ప్రసాద్, జీవన్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఆర్టిజెన్సీ కార్మికులను క్రమబద్ధకరించాలి

## ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చిన జేఏసీ కన్వీనర్ వెంకటయ్య

**అచ్చంపేట డిసెంబర్ 2 (జనంసాక్షి)**

విద్యుత్ సబ్ స్టేషన్లలో పనిచేస్తున్న ఆర్టిజెన్సీ కార్మికులను క్రమబద్ధీకరించేందుకు ఎమ్మెల్యే పూర్తి సహకారం అందించాలని సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విద్యుత్ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఆర్టిజన్స్ కార్మికుల కన్వర్షన్ జయంతి యాక్షన్ కమిటీ సిహెచ్ వెంకటయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన 18 సంవత్సరాల నుండి విద్యుత్ సంస్థలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల ను గత ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ హామీ ఇచ్చి విస్మరించారని, 2016లో ఉద్యోగ



క్రమబద్ధీకరణ కోసం ఉద్యమం చేయగా అప్పటి ప్రభుత్వం 2017 ఆగస్టులో మమ్ములను విలీనం చేస్తూ ఆర్డర్ మంజూరు చేసిందన్నారు. కానీ కొందరు నిరుద్యోగులు కోర్టులో కేసు వేయడం వల్ల నిలిచిపోయిందని తదనంతరం 2018 సెప్టెంబర్ లో కోర్టు మాకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. కాంట్రాక్టు కార్మికులను ఇండస్ట్రియల్ డిస్ప్యూట్ యాక్టివ్ ప్రకారం పర్మనెంట్ చేసుకునే వెసులుబాటును విద్యుత్ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వానికి కల్పిస్తూ తీర్పునిచ్చిందన్నారు. అసెంబ్లీ గవర్నర్ ప్రసంగంలో కూడా చేర్పించి విద్యుత్ సంస్థల్లో 23,667 మందిని పర్మనెంట్ చేశామన్నారు. అయినప్పటికీ మా పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉందని, సబ్ స్టేషన్లలో ఐదు మంది ఉద్యోగులు పనిచేయాల్సి ఉండగా కేవలం ఇద్దరు ముగ్గురితోనే విధులు నిర్వహిస్తూ మాపై పనిభారం మోపుతున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం ఆర్టిజెన్సీ ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరిస్తూ మా కుటుంబాలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉపాధ్యక్షులు శ్రీనయ్య, ఆనంద్ గౌడ్, బాల్య నాయక్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.



## శ్రీ తిమ్మప్ప స్వామికి గోపుర కలశాల వితరణ

**మల్దకల్ డిసెంబర్ 2 (జనంసాక్షి)**

మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయం గోపురాలకు కీ శే శ్రీమతి శ్రీ సింగనేడు ఈరమ్మ బూదయ్య జ్ఞాపకార్థము వారి కుమారులు జ్యోతిశ్రీ నర్సింహాయ్య, పావని నర్సింహాయ్య మల్దకల్ వాస్తవ్యులు రూ.1లక్ష విలువచేసే ఆలయ గోపుర 10 కలశాలను సోమవారం ఆలయ అర్చకులు రమేష్ ఆచారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బస్టాండ్ నరేందర్, కంసాలి కృష్ణ, నరేందర్ గౌడ్,చంద్రశేఖర రావు తదితరులు పాల్గొన్నారు.



## బిసి' డెడికేటెడ్ కమిషన్‌కు వినతి పత్రం

**సంగారెడ్డి, డిసెంబర్ 02 (జనం సాక్షి):**

బిసి లకు రిజేర్వేషన్ లు 50 శాతం పెంచి.. ఏబిసిడి లుగా వర్గీకరణ చేయాలని బిసి డెడికేటెడ్ కమిషన్ కు సంగారెడ్డి బిసి ఐక్యవేదిక ప్రతినిధుల వినతి పత్రం సమర్పించారు. బిసి ల రిజేర్వేషన్ లపై బహిరంగ విచారణ కోసం సంగారెడ్డి జిల్లా కేంద్రం వచ్చిన వెనుక బడిన తరగతుల డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ ని కలిసిన బిసి ఐక్యవేదిక సంగారెడ్డి జిల్లా ప్రతినిధులు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనాభాలో యాభై శాతం పైగ ఉన్నప్పటికి రాజకీయ రిజర్వేషన్ లలో వెనుకబడి ఉన్నామని త్వరలో జరుగబోయే స్థానిక ప్రభుత్వల ఎన్నికలు అయిన పంచాయతీలు, మున్సిపాలిటీలు, ఇతర చట్ట సభలలో బిసి లకు జనాభా ద.మా.షా ప్రకారం రిజర్వేషన్ లు కల్పించి, బిసి రిజర్వేషన్ లను ఏబిసిడిలు గా వర్గీకరణ చేసి రాజకీయ ప్రతినిధ్యం లేని బిసి కులాలకు రిజర్వేషన్‌లు కల్పించాలని కోరినారు. తద్వారా న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వనికి సమగ్ర నివేదిక ఇవ్వాలని వినతిపత్రం లో కోరినారు. బిసి ఐక్య వేదిక ప్రతి నిధులు వెంకట హరి హోర కిషన్, మేదరి మహేంద్ర సంఘం జిల్లా అధ్యక్షులు అంబదాస్, కుమ్మరి సంఘం ప్రధాన కార్యదర్శి కుమ్మరి సాయిలు, మేదరి మహేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీధర్ మహేంద్ర, లింగ బలిజ సమాజం మల్లికార్జున్ పాటిల్, వీర శైవ లింగాయత్ నాయకులు సిద్దేశ్వర్ పాల్గొన్నారు.

## ఏకగ్రీవంగా జిల్లా నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం

**సంగారెడ్డి, డిసెంబర్ 02 ( జనం సాక్షి) :**



సంగారెడ్డి జిల్లాలో నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం ఏర్పాటుకు ఇటీవల జరిగిన సమావేశం విజయవంతంగా ముగిసింది. తెలంగాణ నాలుగవ తరగతి ఉద్యోగుల రాష్ట్ర సంఘం నాయకులు జ్ఞానేశ్వర్, ప్రధాన కార్యదర్శి గంగాధర్ నేతృత్వంలో ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా, జిల్లా స్థాయి సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకునే కార్యక్రమం జరిగింది. ఈ కొత్త సంఘంలో 'మొహమ్మద్ షరీఫ్' ను జిల్లా అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. నాగరాజు కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. మొత్తం 19 మంది సభ్యులతో కూడిన ఈ సంఘం, నాలుగవ తరగతి ఉద్యోగుల హక్కుల కోసం పని చేయడం లక్ష్యంగా ఏర్పడింది. ఈ సంఘం ద్వారా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో వారి సంక్షేమం కోసం అవసరమైన చర్యలు తీసుకోవడంలో సహాయపడే విధంగా కార్యాచరణ చేపట్టనున్నారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ సంఘం సభ్యులు తమ వంతు కృషి చేసి, ఈ సంస్థను మరింత బలంగా మార్చాలని కోరారు. గంగాధర్ మాట్లాడుతూ, సమష్టి శక్తితో సమస్యలను ఎదుర్కొనగలుగుతామని, అందరి భాగస్వామ్యం అవసరమని స్పష్టం చేశారు. ఈ సంఘం ఏర్పాటుతో సంగారెడ్డి జిల్లాలో నాలుగవ తరగతి ఉద్యోగులు తమ సమస్యలను ఏకకంఠంతో ప్రస్తావించే వేదికను పొందారు. ఈ సంఘం వారి హక్కులను నిలబెట్టడంలో ఉద్యోగ శ్రేయస్సు కోసం పనిచేయడంలో ముందు ఉంటుంది అని అన్నారు.

# వీరశైవ లింగాయత్ లింగ బలిజలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించండి

### బిసి డెడికేటెడ్ కమిషన్‌కు సంఘం నాయకుల వినతి

**సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 2 (జనం సాక్షి )**

వీరశైవ లింగాయత్ లింగ బలిజలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించాలని సంఘం అధ్యక్షులు తుమ్మల పల్లి పృథ్వీరాజు బిసి డెడికేటెడ్ కమిషన్ అధ్యక్షులు, రిటైర్డ్ ఐఏఎస్ భూసాని వెంకటేశ్వర్లు కలిసిన వినతి పత్రం అందజేశారు. సోమవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయానికి వచ్చిన కమిషన్ జిల్లా వీరశైవ లింగాయత్ లింగ బలిజ కార్యవర్గం కలిశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా వీరశైవ లింగాయత్ లింగా పలజ కులస్తులం సుమారు 2 లక్షల 50 వెల జనాభా ఉందని రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో తమకు రిజర్వేషన్లు కల్పించాలని బీసీ కమిషన్ ను కోరారు. రాష్ట్రవ్యాప్తంగా త్వరలో జరగనున్న పంచాయతీ, ఎంపీటీసీ, మున్సిపల్ తదితర ఎన్నికల్లో జనాభా ప్రాతిపాదికన రిజర్వేషన్లు కల్పించాలని విజ్ఞప్తి



చేశారు. పృథ్వీరాజ్ వెంట లింగాయత్ లింగ బలిజ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల మల్లికార్జున్ పాటిల్, ఉపాధ్యక్షులు సంగి శెట్టి, భరతప్ప, సెక్రెటరీ శెట్టి మల్లికార్జున, మహిళా ఉపాధ్యక్షురాలు వీరమనేమ్మ పాల్గొన్నారు.

# ప్రజల అభిష్టం మేరకే ప్రజాపాలనందిస్తున్నాం

## తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చెన్నారెడ్డి





**వనపర్తి బ్యూరో డిసెంబర్ 02( జనంసాక్షి)**

తెలంగాణ రాష్ట్రంలో ప్రజల అభిష్టంమేరకే ప్రజాపాలన కొనసాగుతుందని తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు.సోమవారం ఉదయం తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చెన్నారెడ్డి,జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి, అదనపు కలెక్టర్ సంచిత గంగువార్ లతో కలిసి టూ కే రన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఎన్నుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా రంజక ప్రజా పాలన నందిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వసంతం పూర్తి చేసుకోనున్న శుభ తరుణంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ రెండవ తేదీ నుండి తొమ్మిదోవ వ తేదీ వరకు ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలను నిర్వహిస్తుందని తెలిపారు. ఇందులోలో భాగంగా యువజన,క్రీడల శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు, యువతి, యువకులు, క్రీడాకారులతో ప్రభుత్వ శాఖల అధికారులతో 2కే రన్ చెపట్టామన్నారు. ప్రజా విజయోత్స వాలలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల పై ప్రజలలో అవగాహన కల్పించనున్నామన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ముందుకెళ్తుందన్నారు. భవిష్యత్తులో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇదే ప్రారంపరా కొనసాగాలని అకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయం చైర్మెన్ గోవర్ధన్, ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, యువజన మరియు క్రీడల శాఖ జిల్లా అధికారి సుధీర్ రెడ్డి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రెటరీ సురేందర్ రెడ్డి, డీఎస్పీ వెంకటేశ్వర్ రావు,వనపర్తి రూరల్ ఎస్సై జలందర్ రెడ్డి, మున్సిపల్ కమీషనర్ పూర్ణ చందర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బి కృష్ణ,కౌన్సిలర్ బ్రహం చారి, కాంగ్రెస్ పార్టీ పట్టణ కార్యదర్శి ఎండి బాబా, పెద్ద మందడి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పెంటన్న యాదవ్, కాంగ్రెస్ నా యకులు, విద్యార్థులు, క్రీడాకారులు, యువతి యువకులు, పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన పథకం మెనూ తప్పక పాటించాలి

### నిజమొద్దీన్ మండల విద్యాధికారి

**కృష్ణ, డిసెంబర్ 02 (జనం సాక్షి)**

ఎంపియుపీఎస్ హిందూపూర్ పాఠశాల మరియు ఉర్దూ మీడియం పాఠశాలను సందర్శించి పాఠశాల ప్రధానోపాధ్యాయులకు మరియు వంట సిబ్బందికి చేసిన సూచనలు మధ్యాహ్న భోజన పథకం మెనూ తప్పకుండా పాటించాలి. వారంలో మూడు రోజులు తప్పకుండా గుడ్డును పెట్టాలి. గుడ్డును పూర్తిగా ఉడికిన తర్వాతనే విద్యార్థులకు పెట్టాలి. వంట వండిన తర్వాత ముందుగా కమిటీ సభ్యులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధ్యాహ్న భోజన ఇన్చార్జి ఉపాధ్యాయులు తప్పకుండా భోజనాన్ని చేసి రిజిస్టర్లో నమోదు చేయాలిఈ సందర్శనలో భాగంగా కృష్ణా మండల విద్యాధికారి శ్రీ.నిజాముద్దీన్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు (శ్రీమెహర్, అఖిల్ మరియు పాఠశాల ఉపాధ్యాయ బృందం, పాల్గొన్నారు.




## అక్రమ అరెస్టులతో విద్యార్థి ఉద్యమాలను ఆపలేరు

**సంగారెడ్డి, డిసెంబర్ 02 (జనంసాక్షి) :**

సంగారెడ్డి జిల్లా లో 'బీఆర్ఎస్వీ' గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డిలో కస్తూర్బా గురుకుల పాఠశాల సందర్శనకు వెలుతున్న 'బీఆర్ఎస్వీ' రాష్ట్ర ఉపాధ్యక్షులు, గురుకుల బాట జిల్లా ఇన్చార్జి పదాల సతీష్, 'బీఆర్ఎస్వీ' జిల్లా ప్రెసిడెంట్ రాజేందర్ నాయిక్, 'బీఆర్ఎస్వీ' నియోజకవర్గ అధ్యక్షులు శ్రీహరి, 'బీఆర్ఎస్వీ' నాయకులు రోషన్, సందీప్, రాము, వెంకట్, జయేందర్, లక్ష్మణ్, అఖిల్ లను అక్రమంగా అరెస్టు చేసి సంగారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు.

## విద్యార్థుల మనోవికాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయి

### ఎంఈఓ ఆంజనేయులు

**కొత్తపల్లి డిసెంబర్ 2 (జనం సాక్షి)**



విద్యార్థులు చదువుతో పాటు ఆటలలో కూడా వారి యొక్క ప్రతిభకు మెరుగులు దిద్దుకోవాలని ఎంఈఓ ఆంజనేయులు అన్నారు. ప్రజా పాలనలో భాగంగా సోమవారం నిడిజింత పాఠశాల క్రీడా మైదానంలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మనో వికాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిరోజు ఏదో ఒక క్రీడను ఎంపిక చేసుకొని సాధన చేయాలన్నారు. నేటి పరిస్థితులలో విద్యార్థులతోపాటు ప్రతి వ్యక్తికి క్రీడలు చాలా అవసరమన్నారు, అంతకుముందు టాస్ ఎగురవేసి కోకో మ్యాచును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లాజర్, శ్రీనివాస్, విజయ్ రెడ్డి, భీమ్సేన్, వెంకట రాములు, రామకృష్ణ, సుజాత, వరలక్ష్మి, పీడి కతలప్ప తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆటల పోటీలు

### ప్రధానోపాధ్యాయులు డి శేఖర్

**కృష్ణ, డిసెంబర్ 02 (జనం సాక్షి)**



తెలంగాణ రాష్ట్ర విద్యా శాఖ ఆదేశానుసారం.. తెలంగాణ రాష్ట్ర ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా కృష్ణ మండలం ముడుమాల ప్రాథమిక పాఠశాలలలో చదువుతున్న 1నుండి 5వ తరగతి విద్యార్థులకు మ్యూజికల్ చైర్, సర్కిల్ గేమ్, ఎక్కాల పోటి, పద్యాల పోటీ నిర్వహించి 30మంది విద్యార్థులను విజేతలుగా ప్రకటించి, అభినందించడమైనది. వీరికి నేడు ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా గ్రామ ప్రజల చేతులు మీదుగా బహుమతుల ప్రదానం చేస్తాము అని అన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్, పాల్గొన్నారు.

# వరి కొయ్యల కాల్చివేత..కాలుష్యం,సారవంతం లోపం

### శాస్త్రవేత్తల వెల్లడి

కృష్ణ, డిసెంబర్ 02 (జనం సాక్షి)



రైతులు అవగాహన లేక వరికొయ్యలను కాల్చి వేస్తున్నారని దాంతో కాలుష్యంతో పాటు భూమి సారం కోల్పోతుందని శాస్త్ర వేత్తలు వెల్లడిస్తున్నారు.నేటి ఆధునిక యుగంలో వరి పంటలను హార్వెస్టర్ సహాయంతో కోసిన తర్వాత వరి కొయ్యలు పెద్దగా మిగిలిపోతున్నాయి దీంతో నాగలి దున్నే సమయంలో అడ్డు తగులుతాయని కృష్ణ మండలం పరిధిలోని ,రైతులు వరి కొయ్యలకు నిప్పు పెట్టి పొలంలో ఉన్న గడ్డిని మొత్తం కాల్చి వేస్తున్నారు. సారవంతమైన భూమి నిప్పు పెట్టడం వల్ల భూమి లోపల ఉన్న పోషకాలు మొత్తం కోల్పోయి సారం తగ్గిపోయింది. దీనివల్ల రైతులు చాలా రకాలుగా నష్టపోతున్నారు. దీనికి తోడు పర్యావరణ కాలుష్యం ఏర్పడడంతో పాటు పంటలు నష్టపోతారు. దీనికి తోడు పర్యావరణ కాలుష్యం ఏర్పడడంతో పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు మరణిస్తాయి. సారవంతమైన భూమి మొత్తం ఆ వేడికి దెబ్బతింటుంది గతంలో వరి పంటను వేసిన రైతులు కొడవళ్ళ సహాయంతో వరి మొదల వరకు కోసేవారు. దీంతో పశువులకు గ్రాసం సమృద్ధిగా దొరికేది.నేడు పశువులకు గ్రాసం తగ్గి పోతున్నది. చేను కోషాక వచ్చిన గడ్డిని కుప్పలు, కుప్పలుగా సేకరించి చాలా రోజుల వరకు పశుగ్రాసం ఉంచి వాడేవారు. ఇప్పుడు వచ్చిన ఆధునిక యుగంలో యంత్రాల సాయంతో పని చేయడం వల్ల కూడా తగ్గిపోతుంది. దీంతో రైతులు వరి కొయ్యలను విచ్చలవిడిగా కాలుస్తున్నారు.

### వరి కొయ్యలు కాల్చొద్దు

పొలంలో ఇష్ట వచ్చినప్పుడు కొయ్యలు కాల్చడం వల్ల వాతావరణంలో మార్పులు ప్రమాదకర స్థాయికి చేరుతాయని సామాజిక వేత్తలు, శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు అవగాహన ఏమి లేకపోవడంతో పంటలకు ఎ ఎంతో మేలు చేసే కొయ్యలను దున్నేటప్పుడు అలాగే కలియ దున్నడం వల్ల పంటలకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా భూమి కూడా ఆరోగ్యంగా ఉంటుంది. ఆ కొయ్యలు సేంద్రియ ఎరువుగా మారి భూసారం పెరిగి పంటల సస్యరక్షణ కు సహకరిస్తాయి, అలా కాకుండా కోయిలను కాల్చి సమయంలో భూమి మొత్తం గడ్డివడి పంటలకు మేలు చేసే వానపాములో సూక్ష్మ పోషకాలు లోపిస్తాయి. దీంతో వేసిన పంటలు వేరు లోపలికి వెళ్లకపోవడంతో అనేక తెగుళ్లు బారిన పడి రైతులకు నష్టం వాటిల్లుతుందనీ అంటున్నారు. ఎరువులు వేస్తేనే పంటలు పండే పరిస్థితి ఏర్పడింది. విరివిగా ఎరువులు వాడటం వల్ల ఆహారం మొత్తం చాలావరకు కలుషితం అవుతుంది ఇట్టి విషయంపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## శ్రీ ఉమామహేశ్వర దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే కుచుకుల్ల రాజేశ్వర్ రెడ్డి దంపతులు



**అచ్చంపేట డిసెంబర్ 2 (జనంసాక్షి)**

మండల పరిధిలోని ఉమామహేశ్వర క్షేత్రంలో నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్వర్ రెడ్డి వివాహ మహోత్సవం సందర్భంగా దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు వారికి దేవస్థాన చైర్మన్ బీరం మాధవరెడ్డి ఆలయ మర్యాదలతో ప్రత్యేక పూజలు నిర్వహించి శాలువాతో సన్మానించినారు. దేవస్థాన సిబ్బందికి ,వృద్ధులకు శ్రీ ఉమామహేశ్వర దేవస్థానం దగ్గర దుప్పట్ల పంపిణీ చేశారు,శ్రీ ఉమామహేశ్వర దేవస్థాన అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. వారికి శ్రీ ఉమామహేశ్వర చైర్మన్గా ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఈవో శ్రీనివాసరావు మాజీ ఎంపీపీ లోక్యా నాయక్, మాజీ సర్పంచ్ లాచ్చు నాయక్ ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.



## ఘనంగా సెమి క్రిస్మస్ వేడుకలు

**రాజోలి, డిసెంబర్ 02 (జనంసాక్షి)**

మండలంలోని తూర్పు గార్లపాడు గ్రామంలో ఎంబి చర్చి సంఘ పెద్దల ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు క్రైస్తవ భక్తులు ఘనంగా నిర్వహించారు. అనంతరం స్థానిక పాస్టర్ సులోమాన్ మాట్లాడుతూ..రెండు వేల సంవత్సరాల క్రితం ఏసుక్రీస్తు మానవ అవతారుడుగా ఈ భూమిపై జన్మించి ఆయన రక్తంతో లోక పాపాలను కడిగివేసినట్టు తెలిపారు. క్రీస్తు పుట్టుకను ప్రపంచవ్యాప్తంగా పండుగ దినోత్సవంగా జరుపుకుంటారన్నారు. ఏసుక్రీస్తు సర్వలోక పాపములు హరిస్తానికి భూలోకానికి వచ్చారని, ఆయన పుట్టుక ద్వారా లోకానికి రక్షణ వచ్చిందన్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా క్రైస్తవ భక్తులు కొవ్వొత్తులను వెలిగించి కేక్ కట్ చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ సోలోమాన్, సతీమణి షాలోమీ, మిస్సెక్, సంఘ పెద్దలు దేవదాస్, లూకా, కరుణాకర్, హనుమంతు, గిద్దన్న, చిన్నారులు, మహిళలు, పురుషులు తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్పస్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలి

### మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**వనపర్తి,డిసెంబర్02(జనంసాక్షి):**



అయ్యప్పస్వామి ఆశీస్సులు అందరిపై ఉండేలా ప్రార్థించాలని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాలాధారులను కోరారు. సోమవారం జరిగిన పదునెట్టాంబడి పూజల్లో నిరంజన్ రెడ్డి సతీమణి సింగిరెడ్డి వాసంతి,వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.స్వామీ వారి అభిషేక సేవలో నిరంజన్ రెడ్డి దంపతులు పాల్గొని స్వామి వారిని అభిషేకించారు. నారికేళ గురుస్వామిగా శబరిమల వెళుతున్న చిన్న ఆంజనేయులు గౌడ్ గురుస్వామిని ఘనంగా సన్మానించారు. ఇట్టి పూజలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి కూతురు డాక్టర్ ప్రత్యూష గారు పాల్గొన్నారు. గోపాలకృష్ణ గురుస్వామి నిరంజన్ రెడ్డి దంపతులకు తీర్థప్రసాదాలు ఇచ్చి ఆశీర్వదించారు. కాగ 1వార్డ్ కౌన్సిలర్ కాగితాల లక్ష్మీ నారాయణ తన స్వగృహంలో అయ్యప్ప స్వామీ పటం పూజ నిర్వహించి స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. పూజలో పాల్గొన్న మాజీ మంత్రిని లక్ష్మీనారాయణ స్వామి సన్మానించారు. ఈ పూజల్లో గురుస్వాములు, పట్టణ ప్రముఖులు వాకిటి శ్రీధర్, బీచుపల్లి యాదవ్, నందిమల్ల అశోక్, ఉంగ్లమ్ తిరుమల్ ,కాగితాల గిరి తదితరులు పాల్గొన్నారు.

## నేడు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

**మాగనూర్ డిసెంబర్ 2 (జనంసాక్షి):**

మండల కేంద్రంలో నేటి మధ్యాహ్నం మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొననున్నారనీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, మండల యూత్ అధ్యక్షులు దండు ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోనీ నూతన అంగన్వాడి బిల్డింగ్కు భూమి పూజ, సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలం లోని అన్ని శాఖల ప్రభుత్వఅదికారులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీముఖ్య నాయకులు, కార్యకర్తలు అభిమానులు మహిళలు ' మాగనూరు మండల అంగన్వాడీటీచర్స్, ఆయలు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థల కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



## గ్రంధాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### తహసీల్దార్ బాల శంకర్

**కోహీర్ డిసెంబర్ 2 (జనంసాక్షి) :**

గ్రంధాలయాన్ని సంధ్వినియోగం చేసుకొని విజ్ఞనాన్ని సమూపార్జించుకోవాలని తహసీల్దార్ బాల శంకర్ విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని బిలాల్ పూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన రూమ్ టూ రీడ్ సంస్థ వారు ఏర్పాటు చేసిన గ్రంధాలయాన్ని ప్రారంభించారు. ప్రతి రోజు విద్యార్థులు టైం టేబుల్ ప్రకారం గ్రంధాలయ పుస్తకాలను చదవాలని తెలిపారు. డి కోటబుల్ పుస్తకాలు, మెటీరియల్ ఒకటో తరగతి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయి అన్నారు. కార్యక్రమంలో ఆయన తల్లిదండ్రుల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్, ఉపాధ్యాయులు అండాలు నిర్మలా దేవి, మృదుల, సింహాచలం, వినోద, అసిఫా బేగం, సుల్తానా బేగం, సునీత, రూమ్ టూ రీడ్ లిటరసి ఫెసిలిటేటర్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.



## ప్రజ పాలన విజయోత్సవల్లో భాగంగా విద్యార్థులకు ఆటల పోటీలు

**నర్వ జనంసాక్షి):**

నర్వ మండల మండల పరిధిలో కల్వల్ (శ్రీపురం) గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రజ పాలనలో భాగంగా సోమవారం రోజున విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. వాలీబాల్ భాస్కర్ టీమ్ మొదటి బహుమతి, భరత్ రెండవ బహుమతి, సీనియర్ కబడ్డీ అనూష టీమ్, మొదటి బహుమతి, నాగేశ్వరి టీమ్ రెండవ బహుమతి.జూనియర్ కబడ్డీ అనుశ్రీ భార్గవి టీమ్స్ గెలుపొందారు. గెలిచినా టీమ్లాకు విద్యార్థులకు ఎచ్ఎమ్ మహమ్మద్ భాసీర్ బహుమతులు ప్రదానం చేశారు.అనంతరం ఎచ్ఎమ్ మాట్లాడుతూ ఆటలతోను విద్యార్థులు అర్యోగంగా ఉంటారని ఖాళీ సమయంలో ఇంటిదగ్గర ఆటలు ఆడటం వలన చాలా ఉషారుతనం వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## పునరావస గ్రామాలకు పరిహారం అందించాలి

**మక్తల్ డిసెంబర్ 02 (జనంసాక్షి)**

పునరావస గ్రామాలకు పరిహారం అందించాలని తాసిల్దార్, ఇరిగేషన్ అధికారులకు పునరావాస గ్రామ ప్రజలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మక్తల్ మండల లోని బీమా ఫేస్ 1 పునరావాస గ్రామాలైన భూత్పూర్, నేరడగం, దాదన్ పల్లి, అనుగొండ, అంకెన్ పల్లి గ్రామ ప్రజలకు తమకు 30 సంవత్సరముల నుండి పునరావాసని కీ సంబంధించిన విషయంలో చాలా అన్యాయం జరిగిందని అన్నారు. పునరావాసానికి సంబంధించిన అధికారులు మరియు గత ప్రభుత్వం చాలా ఆలస్యం చేశారని తెలిపారు. గత ప్రభుత్వం త్రి మెన్ కమిటీ ఇచ్చిన నివేదికను సైతం ఇచ్చినా మాకు గత ప్రభుత్వం నుండి చాలా ఎలాంటి స్పందన రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా వెంటనే కార్యాచరణను ప్రారంభించకపోతే పునరావాస ప్రజలందరూ కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల పునరావాస గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి

### వికలాంగుల జిల్లా ఉపాధ్యక్షుడు కుర్వ కృష్ణ

**మక్తల్ డిసెంబర్ 02 (జనంసాక్షి)**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో వికలాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వికలాంగుల జిల్లా ఉపాధ్యక్షుడు కుర్వ కృష్ణ అన్నారు. ఎన్పిఆర్డి ఆదేశాల మేరకు సోమవారం వికలాంగుల జిల్లా ఉపాధ్యక్షుడు కుర్వ కృష్ణ, జిల్లా కోశాధికారి బాబు ఆధ్వర్యంలో వికలాంగుల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2024 జనవరి నుండి వికలాంగులకు 6000 రూపాయలు పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చి ఏడాది పూర్తి కావస్తున్న ఇప్పటివరకు హామీ అమలు కాలేదని అన్నారు. అలాగే వికలాంగుల బ్యాక్లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, వికలాంగులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి, కేంద్ర ప్రభుత్వం పెన్షన్ వాటా 300 నుంచి 3 వేలకు పెంచాలి. ఇందిరమ్మ క్యాంటీన్ లో వికలాంగులకు ఐదు శాతం కల్పించాలి. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో కూడా వికలాంగులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలి. ప్రభుత్వ అన్ని రంగాలలో ఉద్యోగ అవకాశాలలో ఐదు శాతం రిజర్వేషన్ అమలు పరచాలని కోరారు. తమ న్యాయమైన డిమాండ్లను అసెంబ్లీ సమావేశంలో మాట్లాడి డిమాండ్స్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరిని కోరారు. ఈ కార్యక్రమంలో మాగనూరు మండల అధ్యక్షులు పి బాబు, కృష్ణ మండలం నుండి మండల అధ్యక్షులు వెంకటేష్, కార్యదర్శి రవి, కోశాధికారి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



## అందరి సహకారంతో విద్యాభివృద్ధి

### బిఎంఇఓ అనిల్ గౌడ్

**మాగనూరు డిసెంబర్ 2 (జనం సాక్షి)**

మండలంలో అందరి సహకారంతో విద్యాభివృద్ధి కి కృషి చేస్తామని మండల విద్యాధికారి అనిల్ గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏ సమస్య ఉన్నా స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయునికి కానీ సిఆర్పిలకు గానీ నేరుగా తనకు సమాచారం ఇస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు.మండలంలో విద్యాభివృద్ధికి గ్రామస్తులు సహకరించాలని కోరారు.కాగా మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పరిశుభ్రత నాణ్యమైన భోజనం అందించేందుకు చర్యలు తీసుకున్నాయని తెలిపారు. ఉపాధ్యాయులు సక్రమంగా విధులు నిర్వర్తించేల విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. సమస్య మొదట్లోనే తమ దృష్టికి తీసుకు వస్తే నివారించేందుకు అవకాశం ఉందని అందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ముందుకు రావాలని సూచించారు. సమావేశంలో సిఆర్పిలు ఎల్లా గౌడ్, కురువ కృష్ణ, ఐయిడి తిరుపతి లు ఉన్నారు,



## ఆశా వర్కర్లకు పెండింగ్ సర్వే డబ్బులు వెంటనే విడుదల చేయాలి

### సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి గోవింద్ రాజ్

**మక్తల్ డిసెంబర్ 02 (జనంసాక్షి)**

గత రెండు సంవత్సరాల నుండి ఆశా వర్కర్లకు లెప్రసీ 2024 పల్స్ పోలియో పెండింగ్ డబ్బులు వెంటనే విడుదల చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి గోవిందరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత సర్వేల డబ్బులు చెల్లించిన తర్వాతనే డిసెంబర్ 2 నుంచి చేపట్టే లెప్రసీ సర్వేలు ప్రారంభించాలని కోరారు. ఆశలకిచ్చే పరిదోషకమే అరవకోరగా ఉండగా ఆ సర్వే ఈ సర్వే అంటూ సర్వేల పేరుతో ఆశలతో వెట్టిచాకిరి చేయించుకోవడం తగదని అన్నారు. సర్వేకు సంబంధించిన డబ్బులను కమిషనర్ కార్యాలయంలో అడగగా బడ్జెట్ ముందే పంపామని అని వివిధ డిమాండ్లతో కర్ని.పి హెచ్ సి సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు యశోద, పిహెచ్‌సి అధ్యక్షురాలు అమీనా బేగం సావిత్రమ్మ, శశిరేఖ, సుజాత, రాధిక, గోవిందమ్మ, కే సుజాత తదితరులు పాల్గొన్నారు



## ఎయిడ్స్ వ్యాధి నివారణపై అవగాహన కల్పించాలి

### జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి డి. ఇందిరా

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**

ఎయిడ్స్ వ్యాధి నివారణపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి డి. ఇందిర అన్నారు. డిసెంబర్ 1వ తేదీ ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆద్వర్యంలో మహబూబ్ నగర్ ఓల్డ్ డి.ఎం.హెచ్.ఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. హెచ్ఐవి నివారణ, నియంత్రణ చట్టం 2017పై ప్రజలను చైతన్యపరిచారు. ఉత్తమ సేవా ప్రదాతలు, వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులకు మెమెంటో, సర్టిఫికెట్‌లు అందజేశారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కృష్ణ మాట్లాడుతూ హెచ్ఐవి, ఎయిడ్స్ నివారణ, నియంత్రణపై జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్య క్రమంలో డాక్టర్ మల్లికార్జున్, డిటిసిఓ డాక్టర్ శశికాంత్, ఎన్ఎస్ఎస్, ఆర్ఆర్‌సి క్లబ్స్ ప్రోగ్రామ్ ఆఫీసర్లతో పాటు జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ, ఎన్‌జిఓలు పాల్గొన్నారు.



## నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

### గురుకుల బాటలో ఎమ్మెల్యే విజయుడు

**మానవపాడు, డిసెంబర్ 2 (జనం సాక్షి)**

బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కేటీఆర్ ఆదేశాల మేరకు, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పర్యవేక్షణలో గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా..సోమవారం అలంపూర్ చౌరస్తాలోని బీసీ గురుకుల బాలుర స్కూల్‌ని సందర్శించి సమస్యలను తెలుసుకోవడం జరిగినది. పిల్లల పైన నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. అక్కడున్న సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనశాలకు వెళ్లి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు లైట్లు, ఫ్యాన్లు లేవని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. తొందర్లోనే ఆ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే, పిల్లలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు గజేందర్ రెడ్డి, కిషోర్,వెంకటరాములు, శ్రీను పాల్గొన్నారు.



## చెకుముకి సైన్స్ సంబరాల్లో ముస్త్యాల ఆదర్శ పాఠశాల

**చేర్యాల డిసెంబర్ 02 (జనంసాక్షి):**
గత నెల 28న జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో ముస్త్యాల ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎన్ స్నేహ (8వ తరగతి), ఎం. భువన తేజ (9 వ తరగతి), జి లోకేష్ (10వ తరగతి)లు పాల్గొని ద్వితీయ బహుమతి పొందిన సందర్భంగా సోమవారం ప్రిన్సిపాల్ జె. భిక్షం, వైస్ ప్రిన్సిపాల్ కే.నరేందర్ రెడ్డి, ఇంచార్జి ప్రతాప్, ప్రణీత ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.



## పోలింగ్ బూతుల ముసాయిదా తయారు చేయండి

### పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో అవగాహన

**చేర్యాల డిసెంబర్ 02 (జనంసాక్షి):**
అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పోలింగ్ బూతుల ముసాయిదా తయారు చేయాలని చేర్యాల ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో మహబూబ్ ఆలీ అవగాహన కల్పించారు. పోలింగ్ బూతుల ముసాయిదను తయారు చేయాలని సూచించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ముసాయిదా జాబితాను తయారు చేయాలని, సీఎం కప్ ఈనెల 7,8 వ తేదీల్లో గ్రామస్థాయిలో నిర్వహించి ఈనెల మండల స్థాయిలో 10,11,12 తేదీలలో మండల స్థాయిలో వివిధ రకాల ఆటలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రచ్చ కిష్టయ్య, ఏపీవో మంజుల, గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## మానవత్వం చాటుకున్న జిల్లా పాలనాధికారులు

**మెదక్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 2 (జనం సాక్షి):**
రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రుని ఆసుపత్రికి తరలించి జిల్లా పాలనాధికారులు సోమవారం తమ మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్లు గ్రామంలో సోమవారం ముఖ్యమంత్రి పర్యటనకు వెళ్లి జిల్లా పాలన అధికారులు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్, అదనపు కలెక్టర్ నగేష్ మెదక్ జిల్లా తిరుగు ప్రయాణమయ్యారు. ఇదే సమయంలో మెదక్ మక్త భూపతిపూర్ గ్రామానికి చెందిన రాజు చిన్న శంకరం పేట మండల కేంద్రంలో సెక్యూరిటీ గార్డ్‌గా విధులు నిర్వహించుకుని బైక్ పై ప్రయాణం చేస్తుండగా కొరివిపల్లి వరి ధాన్యం కొనుగోలు కేంద్రం సమీపంలో బైకు అదుపుతప్పి రోడ్డుపై పడడం జరిగింది. అదే సమయంలో మెదక్ వైపు వస్తున్న జిల్లా పాలన అధికారులు ప్రమాద దృశ్యాన్ని చూసి వాహనాలను ఆపి హుటాహుటిన ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స నిమిత్తం వైద్యాధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు .జిల్లా పాలనాధికారులు చూపించిన మానవతా దృక్పథానికి ప్రజలు హర్షిస్తున్నారు.

# ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

### వర్చువల్ విధానంలో పారా మెడికల్, నర్సింగ్ స్కూల్, ట్రాన్స్ జెండర క్లినిక్ ప్రారంభోత్సవం

### మెదక్ మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ట్రాన్స్ జెండర్ క్లినిక్ సూపరిడెంట్ శివ దయాల్ ప్రారంభించారు

**మెదక్ జిల్లా బ్యూరో డిసెంబర్ 2(జనంసాక్షి):**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తికానున్న నేపథ్యంలో ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల సందర్భంగా ప్రజాపాలన - ప్రజా విజయోత్సవాల్లో భాగంగా సోమవారం మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆరోగ్య ఉత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ రవీందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. వర్చువల్ పద్దతిలో పారామెడికల్, నర్సింగ్



స్కూల్, ట్రాన్స్ జెండర్ క్లినిక్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను, మైత్రి మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క ప్రారంభించగా, స్థానికంగా జ్యోతి ప్రజ్వలన చేసి కలెక్టర్ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభోత్సవం చేశారు. మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ట్రాన్స్ జెండర్ క్లినిక్ సూపరిడెంట్ శివ దయాల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ కమలాదేవి, డిసిహెచ్ఎస్ సూపరిండెంట్ శివ దయాల్, ప్రొఫెసర్ శాంత కుమారి, గైనకాలజిస్ట్ హెచ్ఓడి శాంత కుమారి, వైస్ ప్రిన్సిపల్ వాణి పద్మజ వైద్యారోగ్య శాఖ అధికారులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

# సోమేశ్వరాలయంలో భక్తుల ప్రత్యేక పూజలు

**శివ్వంపేట డిసెంబర్ 2 (జనంసాక్షి):**
మార్గశిర మాసం మొదటి సోమవారాని పరిష్కరించుకొని మండల పరిధిలోని గూడూరు గ్రామ శివారులో ఉన్న సోమేశ్వర స్వామి ఆలయంలో మూలమూర్తిని భక్తుల దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజ నిర్వహించారు. ఆలయ వంశపార పూజారి శాస్త్రుల రాజశేఖర శర్మ ఆధ్వర్యంలో గణపతి ఆరాధన అభిషేకం, అమ్మవారికి దుర్గాసూక్త పారాయణం, లక్ష్మి అష్టోత్తర పూజ, శివాష్టోత్తరం, విష్ణు సహస్ర నామార్చన, విష్ణు అష్టోత్తరంలతోపాటు నమక చమకలతో రుద్రాభిషేకం చేపట్టారు. అదేవిధంగా గూడూరు వాస్తవ్యులు ప్రముఖ హైకోర్టు న్యాయవాది జిన్నారం పెద్దగొని శివ కుమార్ గౌడ్ రమాదేవి దంపతులు వారి 44 వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో మహాదేవుడిని దర్శించుకొని రుద్రాభిషేకం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన పూజారి రాజశేఖర్ శర్మ మాట్లాడుతూ సోమేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నానని అందులో భాగంగానే ఇటీవల ఆలయం ముందు ధ్వజస్తంభం ఏర్పాటు చేసి, దాతల సహకారంతో జీర్ణోద్ధరణ కార్యక్రమం వైభోగంగా నిర్వహించమన్నారు. దాతలు సహకరిస్తే దేవాలయ అభివృద్ధిని మరింత ముందుకు తీసుకువెళ్తానని చెప్పారు. అలాగే శివంపేటలో ఉన్న కోదండ రామాలయం అభివృద్ధి కోసం, ఆలయంలో ధ్వజస్తంభ ఏర్పాటుకు గ్రామస్తులు ముందుకు వస్తే తను కూడా సంపూర్ణంగా సహకరిస్తారని ఆయన పేర్కొన్నారు. సోమేశ్వర స్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన వారిలో చిన్నగొట్టి ముక్క గ్రామానికి చెందిన హనుమంతరావు



దంపతులు, గూడూరు గ్రామానికి చెందిన యాదగిరి యాదవ్ దంపతులు, శివంపేటకు చెందిన మహేష్ యాదవ్ దంపతులు, పీ. దేవేందర్ గౌడ్ దంపతులు, కాలేగారి సత్యనారాయణ, బల్మంపేట భాస్కర్, కొంతాన్ పల్లి సత్యనారాయణ గౌడ్ లతోపాటు అయ్యప్ప స్వాములు వజ్జ శ్రీనివాస్, వజ్జ రాజు, కొత్త కుమ్మరి ప్రకాష్, అజయ్ తదితరులు ఉన్నారు.

# దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలు పరిష్కరించాలి

### జిల్లా రెవిన్యూ అధికారి భుజంగరావు

**మెదక్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 2 (జనం సాక్షి):**
జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరం నందు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి పలు సమస్యలపై వచ్చిన వచ్చిన ప్రజల వద్ద నుంచి దరఖాస్తులను డిఆర్ఓ భుజంగరావు స్వీకరించారు. జడ్పీ సీఈఓ ఎల్లయ్యతో కలిసి ప్రజల నుండి పింఛన్ -04, ధరణి-37, ఇందిరమ్మ ఇండ్లు,-02 ఇతర సమస్యలు-29 మొత్తం -72 దరఖాస్తులు



స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కార దిశగా కృషి చేయాలని పరిష్కారం కాని అంశాన్ని క్షుణ్ణంగా వివరించి ప్రజావాణి పై ప్రజలకు నమ్మకం ఏర్పడే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేవేసేందుకు కృషి చేయాలని చెప్పారు. ప్రజల వద్ద నుంచి వచ్చిన దరఖాస్తులను సత్వర పరిష్కారానికి సంబంధిత జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో , ఇతర జిల్లా అధికారులు, సంబంధిత శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## సీసీఐ పత్తి కొనుగోలులో రైతులకు ఇబ్బందులు పెట్టొద్దు

### రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ మంతూర్ సుధాకర్ రెడ్డి

**మునిపల్లి డిసెంబర్ 2 (జనంసాక్షి):**
సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు పెట్టొద్దని రాయి కోడ్ మార్కెట్ చైర్మన్ మంతూర్ సుధాకర్ రెడ్డి నిర్వాహకులకు సూచించారు. సోమవారం మునిపల్లి మండలంలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పత్తి కొనుగోలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బందులు పెట్టొద్దని సూచించారు. కార్యక్రమంలో ఏడిఏ సత్యనారాయణ, సీసీఐ ఇంచార్జి వరుణ్,మార్కెట్ కమిటీ సెక్రటరీ రవికుమార్, ఏఈఓ నిఖిత, మార్కెట్ కమిటీ డైరెక్ట్ మహేష్ కురమ పాల్గొన్నారు.



## సీఎంకి స్వాగతం పలికిన పూజల హరికృష్ణ

**సిద్దిపేట బ్యూరో డిసెంబర్ 02 (జనంసాక్షి)**
సిద్దిపేట నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డిని నియోజకవర్గ సిద్దిపేట ఇన్చార్జి పూజల హరికృష్ణ కోరారు. సిద్దిపేట జిల్లాలోని ములుగు మండలంలో ఒక కోలా కంపెనీ ప్రారంభోత్సవానికి సోమవారం విచ్చేసిన సీఎం రేవంత్ రెడ్డిని హెలిప్యాడ్ వద్ద ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పూజల హరికృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా ముందుగా సీఎం రేవంత్ రెడ్డికి అభినందనలు తెలిపారన్నారు.





## స్మశాన వాటిక పక్కన మోటార్ సైకిల్

**కోహీర్ డిసెంబర్ 2 (జనంసాక్షి):**
కోహీర్ పట్టణ శివారులోని ముస్లిం స్మశాన వాటిక పక్కన గుర్తు తెలియని వ్యక్తులు ఉంచిన మోటార్ సైకిల్‌ను కనుగొన్నారు. గతవారం రోజులుగా ఒకే చోట్ల నిలిపిఉండడాన్ని గమనించిన స్థానికులు సోమవారం పోలీస్ లకు పిర్యాదు చేశారు. కోహీర్ నుంచి పైడిగుమ్మల్ వెళ్లే పాతరోడ్డు పక్కన ఫ్యాషన్ ప్లస్ పి 12 హెచ్ 8020 వాహనం గత ఎనిమిది రోజులుగా నిలిపివుంది. రెండు రోజుల క్రితం మోటార్ సైకిల్ ఒక ముందు చక్రాన్ని గుర్తు తెలియని వ్యక్తులు తొలగించుకొని వెళ్లారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కోహీర్ పోలీస్ లు వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.



## పేదల విద్యాభివృద్ధికి కృషి చేయడం ప్రశంసనీయం

### మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ యజ్ఞశ్రీ

**కొండపాక, డిసెంబర్ 2 (జనంసాక్షి)**
ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే పేద విద్యార్థులను భవిష్యత్తు పోటీ పరీక్షలకు సంసిద్ధులను చేయాలనుకోవడం అందుకు అయ్యే వ్యయప్రయాసలను స్వచ్ఛందంగా భరిస్తూ ముందుకు రావడం ప్రశంసనీయమని కొండపాక మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ యజ్ఞశ్రీ అన్నారు. దుద్దెడ గ్రామానికి చెందిన లీడ్ లైఫ్ హ్యాపీ సంస్థ వ్యవస్థాపకుడు కోణం శ్రీకాంత్ మిత్ర బృందం చేస్తున్న విద్యాదానం అభినందనీయమన్నారు. ఆ సంస్థ ద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పలు పోటీ పరీక్షలను నిర్వహిస్తూ విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలను అందించడం వారి నిస్వార్థ సేవలకు తార్కాణం అని పేర్కొన్నారు. దుద్దెడ జాగృతి ఫ్రెండ్స్ మాజీ అధ్యక్షుడు, పాత్రికేయుడు వడ్లకొండ శ్రీనివాస్‌తో కలిసి స్థానిక ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో 6,7,8 తరగతుల విద్యార్థులకు పాథ్ ఫైండర్ స్టడీ మెటీరియల్ పుస్తకాలను ఉచితంగా సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిబ్రవరిలో నిర్వహించే జిల్లా స్థాయి పాథ్ ఫైండర్ పరీక్షకు సంసిద్ధులు కావాలని విద్యార్థులకు సూచించారు. అందుకు ఉపయోగపడే పుస్తకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో లీడ్ లైఫ్ హ్యాపీ సంస్థ ఆర్గనైజర్ పంజ రమేష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఈఎంఐ కట్టలేక వ్యక్తి మృతి

**శివ్వంపేట, డిసెంబర్ 2 (జనంసాక్షి):**
ఆటో ఈఎంఐ కట్టలేక మనస్థాపానికి గురై ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన శివ్వంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రమైన శివ్వంపేట గ్రామానికి చెందిన పెద్ద కోళ్ల సంజీవ్ (30) గత ఎనిమిది నెలల నుంచి ఆటో ఫైనాన్స్ తీసుకొని దానిని నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆటో ఈఎంఐ కట్టలేక మనస్థాపానికి గురైన అతడు ఈనెల 1న రాత్రి 8 గంటల సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కి చీరతో ఉరి వేసుకొని మృతి చెందాడు. ఈ విషయంపై మృతుని భార్య శ్రీ కన్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

# టిబి వ్యాధి రహిత మండలాలుగా మారుద్దాం

### జిల్లా ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ వంశీకృష్ణ

**వీపనగండ్ల, డిసెంబర్ 2 (జనం సాక్షి)**
టీబీ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం అందించేందుకు గ్రామాలలో టీబీ స్క్రీనింగ్ క్యాంపు లను ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లా ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ వంశీకృష్ణ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని సామాజిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎం, ఆశ కార్యకర్తల తో టీబీ శిక్షణ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..



ఉమ్మడి మండలాలలోని ప్రతి గ్రామాన్ని టీబీ రహిత గ్రామంగా మార్చాలని, సిబ్బంది ఏపీ వ్యాధి పైన ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఆశా వర్కర్లు నెలవారీగా చేయవలసిన లక్ష్యాలను పూర్తి చేయాలని వైద్య సిబ్బందికి తెలిపారు. గర్భవతుల, మాత శిశు సంరక్షణ పై నిర్లక్ష్యం చేయకూడదని తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని డ్రై డే కార్యక్రమంపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమలమ్మ విజయకుమారి, ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవాలు



**మఖ్తల్ డిసెంబర్ 02 (జనంసాక్షి)**
మక్తల్ పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మూడు రోజులపాటు నిర్వహించనున్న వేడుకల్లో భాగంగా తొలిరోజు ఉదయం ధ్వజారోహణ కార్యక్రమం చేపట్టారు. అంతకుముందు ఐదు గంటలకు అభిషేకం, 7:00కు గోపూజ, ఆ తర్వాత మహా మంగళహారతి , అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. మంగళ, బుధవారాల్లో సైతం కార్యక్రమాలు ఉంటాయని గురుస్వామి అశోక్ గౌడ్ తెలిపారు. ఉత్సవాల కోసం తాయప్ప ,హరికృష్ణ, వేణుగోపాల్ రెడ్డి, ఆంజనేయులు, మహేశ్వర్ రెడ్డి దాతలుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గురుస్వాములు, ఇతర స్వాములు ,భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## చేనేత జౌళి శాఖ వస్త్ర ప్రదర్శనను ప్రారంభించిన రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**
ప్రజా పాలన విజయోత్సవాల సందర్భంగా చేనేత జౌళి శాఖ సంచాలకుల ఆదేశాల ననుసరించి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా చేనేత సహకార సంఘాలు ఉత్పత్తి చేసిన వస్త్ర ప్రదర్శన, అమ్మకాల స్టాల్‌ను జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రదర్శన ఈ నెల 9వ తేదీ వరకు కొనసాగుతుందని, ఈ ప్రదర్శనలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన చేనేత సహకార సంఘాలు ఉత్పత్తి చేసిన వివిధ రకాల వైవిధ్య వస్త్ర ప్రదర్శన, అమ్మకాలు చేయనున్నట్లు తెలిపారు. చేనేత వస్త్రాల ప్రదర్శన స్టాల్ ను సందర్శించి వస్త్రాల కొనుగోలుతో చేనేత కార్మికులను ప్రోత్సహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు బాబు, డిపిఆర్ఓ శ్రీనివాస్, బిసి సంక్షేమ శాఖ అధికారిణి ఇందిర, చేనేత జౌళి శాఖ ఏడిఓ లావణ్య, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి అదనపు కలెక్టర్ బేన్ షాలమ్

**నారాయణపేట జిల్లా బ్యూరో(జనంసాక్షి):**
ప్రజావాణి కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులకు ప్రాధాన్యతనిచ్చి సత్వరమే వాటిని పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బేన్ షాలమ్ అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ గరిమా నరులతో కలిసి అదనపు కలెక్టర్ ఫిర్యాదులను స్వీకరించారు. సోమవారం నాటి ప్రజావాణికి 20 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ రకాలైన ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ల కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ రాంచందర్, కలెక్టరేట్ ఎ. ఓ.జయసుధ, అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## కొండ చెరువు పిల్ల కాలువకు మరమ్మత్తులు

**చారకొండ, డిసెంబర్ 2 (జనంసాక్షి)**
మండలంలోని చారకొండ పెద్ద చెరువు ఆయకట్టు కింద ఉన్న వ్యవసాయ పొలాలకు ఆరుతడి పంటల కోసం పొలాల వెంబడి పూడిపోయి ఉన్న పిల్ల కాలువలకు ఎక్సవేటర్తో ఆయకట్టు దారులు తమ సొంత ఖర్చులతో సోమవారం మరమ్మత్తులు చేపట్టారు. చెరువునుండి నీటిని విడుదల చేస్తే ఆయకట్టు కింద ఉన్న 200 ఎకరాలకు సాగునీరు అందుతుందని రైతులు పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకట్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బలరాం గౌడ్, మండల పర్కింగ్ ప్రసిడెంట్ పానుగంటి అంజయ్య, మండల యూత్ ప్రెసిడెంట్ గణేష్ గౌడ్, ఎన్ ఎస్ యు ఐ మండల అధ్యక్షుడు గోరటి శివ, రైతు సెల్ అధ్యక్షుడు అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, రైతులు కేశమోని శంకర్ గౌడ్, ఆరేళ్ల వెంకటయ్యగౌడ్, జెల్ల బాలయ్య గౌడ్, వెంకటయ్యగౌడ్, గుండె శివగౌడ్ బాడిగ జనార్దన్ గౌడ్ , గుండె పావయ్యగౌడ్, గుండె లక్ష్మయ్యగౌడ్, ఎముల రవిగౌడ్, చింతపల్లి యాదయ్యగౌడ్, చింతపల్లి లక్ష్మయ్య గౌడ్, లింగయ్యగౌడ్, గుండె రామకృష్ణ, సాయిగౌడ్, సురకారపు సత్తయ్యగౌడ్, ఎండి నిజాం, జంతుక శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఖాతాదారుల జీవితాలతో ఎంతకాలం ఆడుకుంటారు

- అచ్చంపేట ఎస్‌బిఐ బ్యాంకు మేనేజర్ నిలదీసిన ఖాతాదారులు
- అయకులను అవస్థలు పెట్టడం తగదు.. ఊరుకునే ప్రసక్తి లేదు
- టిపిసిసి ఎన్నారై సెల్ అడ్వైజరీ కమిటీ మెంబర్ బొజ్జ అమరేందర్ రెడ్డి



**అచ్చంపేట డిసెంబర్ 2 (జనంసాక్షి):** అచ్చంపేట పట్టణంలోని ఎస్‌బిఐ బ్యాంకులో ఖాతాదారులైన మోకురాల దాస్ గౌడ్, సునందల, అనితలతోపాటు మరికొంత మంది మొత్తం 21 మంది అకౌంట్లో దాచుకున్న ఖాతాదారుల డబ్బులు సుమారు రూ. 95 లక్షలు బ్యాంకులో పనిచేస్తున్న క్లర్క్ ఖాతాదారులకు తెలవకుండానే నేరుగా అకౌంట్‌లో ఉన్న డబ్బులను మాయం చేసిన విషయంపై ఏడాది అవుతున్న ఖాతాదారులకు డబ్బులు ఇవ్వకపోవడంపై సోమవారం మరోసారి బ్యాంకు మేనేజర్ ని కలిసి తక్షణమే డబ్బులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఖాతాదారులతో ఎన్నారై అడ్వైజరి కమిటీ సభ్యులు అమరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిలదీశారు. బ్యాంకు అధికారుల నుండి ఇప్పటి వరకు ఉలుకు పలుకు లేకపోవడంతో బుధవారం బ్యాంకు వద్దకు వచ్చిన ఖాతాదారులు మేనేజర్ ను మా డబ్బులు ఎప్పుడు ఇస్తావని ఇంకెంతకాలం కాలయాపన చేస్తారన్నారు. చిన్నచిన్న అవసరాలకు సైతం డబ్బులు లేక అప్పులు చేసుకోవాల్సి వస్తుందని, రైతుల బాధ అర్థం చేసుకోరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీపిసిసి సెల్ ఎన్నారై అడ్వైజరీ కమిటీ మెంబర్ బొజ్జ అమరేందర్ రెడ్డి బాధిత ఖాతాదారులతో అచ్చంపేట ఎస్బిఐ మేనేజర్ హుస్సేన్ భాష ను డబ్బులు మాయం చేసిన విషయంపై ఇప్పటి వరకు ఎలాంటి శాఖా పరమైన చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా బ్యాంకు ఉన్నత అధికారులు త్వరతగతిన ఖాతాదారుల పక్షాన ఆలోచన చేసి డబ్బులు అకౌంట్లో పడేలా న్యాయం చేయాలన్నారు. నెల రోజులలో ఖాతాదారు లందరికీ డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని ఇటీవల బ్యాంకు ఇంటలిజెంట్ అధికారుల విచారణ పూర్తయింది అని మరొక్కసారి విచారణ చేసి కష్టమర్లకు న్యాయం చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.

# ప్రేమించి పెళ్ళాడింది..!

- ఏడడుగుల బంధం మర్చింది
- కట్టుకున్న భర్తను కడదేర్చింది
- మునిపల్లి మండలంలో జరిగిన ఘటన



**మునిపల్లి,డిసెంబర్ 2(జనంసాక్షి):** అతడిని ప్రేమించింది..నువ్వు లేక నేను లేను అన్నది..కులం వేరైనా ఫర్వా లేదని అతనితో మూడు ముళ్ళు వేయించుకుంది. కట్టుకున్న వాడినే కడతీర్చింది. ఈఘటన సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం మక్తక్యాసారం గ్రామంలో జరిగింది. వివరాలలోకి వెళ్తే.. హైదరాబాద్‌లోని శంషాబాద్‌కు చెందిన గుడ్ల సంపత్ (39) మునిపల్లి మండలం మక్తాక్యాసారంకు చెందిన మంజుల ప్రేమ వివాహం చేసుకుని హైదరాబాద్‌లో నివాసం వుంటున్నారు. కొన్ని సంవత్సరాల వరకు వారి జీవనం సజావుగా సాగింది. కుటుంబ కలహాలతో ఆమె కొన్ని రోజుల క్రితం తన తల్లి గ్రామమైన మక్త క్యాసారం గ్రామానికి వచ్చి అక్కడే ఉంటుంది. సంపత్ తన భార్య, పిల్లల తీసుకువెళ్ళడానికి మక్త క్యాసారం వచ్చేవాడు. ఈ క్రమంలో భార్యకు నచ్చజెప్పి తీసుకు వెళ్దామని ఆదివారం నాడు సంపత్ గ్రామానికి వచ్చాడు. రాత్రి ఇరువురి మధ్య మాటమాట పెరగడంతో మంజుల కట్టేతో విచక్షణా రహితంగా భర్త తలపై కొట్టి బయటికి నెట్టి వేయడంతో తలకు బలమైన గాయమై సంపత్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు యాదగిరి ఫిర్యాదు మేరకు ఎస్సై రాజేష్ నాయక్ కేసు నమోదు చేసుకుని మృత దేహానికి పోస్ట్ మార్టం నిమిత్తం సదాశివపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసును దర్యాప్తు చేస్తున్నారు. వారికి ఒక బాబు,పాప వున్నారు.



## జూపల్లిలో మెగా పశువైద్య శిబిరం

**చారకొండ, డిసెంబర్ 2, (జనంసాక్షి)** మండలంలోని జూపల్లిలో పీవీ నరసింహారావు పశు వైద్య యూనివర్శిటీ, పశుసంవర్ధక వైద్య శాఖ ఆధ్వర్యంలో మెగా పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా పశువులకు సంబంధించిన సమస్యలపై జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ రమేశ్ రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. పశువులకు వ్యాధులు సోకకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. శిబిరంలో 228 పశువులకు చికిత్స చేసి నరల్ మిక్సర్ తో పాటు మందులు ఉచితంగా పంపిణీ చేసిన్నట్లు వైద్యులు తెలిపారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో కల్తీ, కృత్రిమ పాల వల్ల కలిగే రోగ్య సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో మండల వైద్యాధికారి శివకుమార్, వీఎల్వో షేక్ మదర్, ద్యులు, వైద్య విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా పడమటి అంజన్న బ్రహ్మోత్సవాలు

తాగునీటి కోసం ఇబ్బంది లేకుండా, చుట్టు పక్కల పంచాయతీ ల నుంచి 30 వరకు ట్యాంకర్లు అందుబాటులో ఉంచాలని అన్నారు. జాతర ఉత్సవాల సమయంలో వీధి దీపాలు సరిచూసుకోవాలని, నిమిషం కరెంటు కోతలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆంబులెన్సులు సిద్ధంగా ఉంచి, అత్యవసర వైద్యం అందేలా చూడాలని వైద్యాధికారులకు సూచించారు. ఉత్సవాల సమయంలో ప్రత్యేక ఆర్టీసీ బస్సులు గ్రామాలకు ఉండేలా చూడాలని, ప్రతి బస్సుపై జాతర ఉత్సవాల పోస్టర్లు ఉండాలని అన్నారు. సీఎం రేవంత్ తోపాటు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ను ఉత్సవాలకు ఆహ్వానిస్తామని అన్నారు. కార్యక్రమంలో నేతలు బాలక్రిష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి, కట్టా సురేష్ గుప్తా, ఎ.రవి కుమార్, మల్లికార్జున్, రాజశేఖర్ రెడ్డి, తహసీల్దార్ సతీశ్, ఆర్టీసీ డిపో మేనేజర్ లావణ్య, మున్సిపల్ కమిషనర్ భోగీశ్వర్లు, ఎంపీడీవో రమేశ్, విద్యుత్ ఏఈ రామకృష్ణ, డాక్టర్ హబీబ్ , వల్లంపల్లి లక్ష్మణ్, మందుల నరేందర్, ఆలయ అర్చకులు అరవిందాచారి, సిబ్బంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మైత్రి ట్రాన్స్ క్లినిక్ ఏర్పాటు చేయడం హర్షనియం

ఓపి విభాగంలో ఒక మెడికల్ ఆఫీసర్, ఒక కౌన్సిలర్లును ఏర్పాటు చేయడం జరిగిందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. నర్సింగ్ సేవలు ను గూర్చి ప్రస్తావిస్తూ వైద్య విభాగంలో నర్సింగ్ సేవలు చాలా ముఖ్యమైనవని అన్నారు. కేరళ,ఇతర రాష్ట్రాల నుండి వచ్చి తెలంగాణలో నర్సింగ్ కోర్సులు అభ్యసించే వారు చాలామంది ఉన్నారు ఆపరేషన్ జరిగినప్పుడు డాక్టర్ కు సహాయకునిగా సేవలు అందిస్తారని, ఆపరేషన్ జరిగిన తర్వాత పేషెంట్ త్వరగా కోలుకోవాలనే విధంగా నర్సింగ్ సేవలు అందిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా వైద్య అధికారి గాయత్రి, వైద్య కళాశాల ప్రిన్సిపల్ సుధా మాధురి ,జిల్లా సంక్షేమ అధికారి వసంతకుమారి, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ అనిల్ కుమార్, ట్రాన్స్ జెండర్ లప్లీ టీం, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పాఠశాల..'అభివృద్ధికి మేము సైతం'..!

పాతిక సంవత్సరాల అనంతరం పూర్వ విద్యార్థులు ఒకరి నొకరు కలుసుకొని ఆత్మీయతతో పలకరించుకున్నారు. ఆట పాటలతో సందడి చేశారు. పాఠశాలలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించేందుకు తమ వంతుగా కృషి చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మోహన్ రెడ్డి, కృష్ణ, కవిత, బక్కన్న, పూర్వ విద్యార్థులు మల్లేష్, జైపాల్ రెడ్డి, గోపాల్, జగనాథ్ రెడ్డి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.



## ఈనెల 4న రవీంద్ర భారతిలో సాంస్కృతిక సారథి ఛైర్మన్ వెన్నెలకు సన్మానం

**సిద్దిపేట బ్యూరో డిసెంబర్ 02 (జనంసాక్షి)** తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల వేదిక ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి ఛైర్మన్‌గా గద్దర్ బిడ్డ వెన్నెల ఎన్నికైనందున ఉద్యమ నిరుద్యోగ కళాకారులందరూ కలిసి గద్దర్ వెన్నెలను ఈ నెల 4న రవీంద్ర భారతిలో సన్మానిస్తున్నట్లు సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు పిన్నింటి దాసు తెలిపారు. జిల్లా కళాకారులందరూ ఈ సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళా ప్రసాద్, బండకాడ గణేష్, భుజంగం, కుంచం శ్రీనివాస్, యాదవ్ ఇనుప సురేష్, సుంచు బిక్షపతి, కందికట్ల రాజు, బెజుగామ నర్సింలు, వెంకటయ్య, ఐరేని రేణుక తదితరులు పాల్గొన్నారు.



## రామ్ సాని పల్లిలో ఆర్టీసీ ఎక్స్ప్రెస్ స్టాప్ ఓపెనింగ్

**జోగిపేట్ డిసెంబర్ 02 (జనంసాక్షి):** అందోల్ మండలం రంసాన్ పల్లి వద్ద, ఆర్టీసీ ఎక్స్ ప్రెస్ స్టాపు ఓపెనింగ్ చేశారు. గత కొద్దిరోజులుగా నారాయణఖేడ్ డిపో మేనేజర్‌ను రామ్సాన్పల్లి చుట్టుపక్కల ఆరు గ్రామాల ప్రజల విజ్ఞప్తి మేరకు డిపో మేనేజర్ అక్కడ స్టాప్ ఏర్పాటు చేశారు, ఇందులో బాంగానే సోమవారం నాడు రామ్సన్ పల్లి వద్ద ఆరు గ్రామాల ప్రజలు. గ్రామ పెద్దలు డిపో మేనేజర్ ఆదేశాల మేరకు స్టాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంసాన్ పల్లి, రామ్సన్ పల్లి తండా చుట్టుపక్కల కిచ్చన్న పల్లి ,ఎర్రారం, నేరేడుగుంట, కంసాన్పల్లి, గ్రామాల ప్రజలకు ఆర్టీసీ ప్రయాణ ఇబ్బందులు తీరుతాయన్నారు. అక్కడ ఆర్టీసీ బస్సులు ఆపకపోవడం వల్ల ప్రయాణికులు చాలా ఇబ్బంది పడ్డారని ఆటోలను ఆశ్రయించి ప్రయాణాలు చేసేవారని దీని దృష్టిలో ఉంచుకొని గ్రామాల ప్రజల విజ్ఞప్తి వేరకు స్టాఫ్ ఏర్పాటు చేసిన నారాయణఖే డిపో మేనేజర్‌కి ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరు గ్రామాల ప్రజలు యువకులు విద్యార్థులు పాల్గొన్నారు.



## రాయిలపూర్ ఉన్నత పాఠశాలలో ఆటపోటీలు

**కౌడిపల్లి డిసెంబర్ 2 (జనంసాక్షి)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా మెదక్ జిల్లా కలెక్టర్, విద్యాశాఖ ఆదేశాల మేరకు కౌడిపల్లి మండలంలోని రైలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో ప్రధానోపాధ్యాయురాలు లవీనజ్యోతి ఆధ్వర్యంలో క్రీడలను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లవీన జ్యోతి మాట్లాడుతూ.. ఆటలు ఆడటం వల్ల శారీరకంగా మానసికంగా దృఢంగా ఉంటారని, గెలుపు ఓటములు సహజమనే అని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సరిత, జగదీశ్వర్, కవిత, అనిల్,ప్రసాద్ రెడ్డి, లక్ష్మి, కృష్ణవేణి, దీపిక, కృష్ణమూర్తి, లక్ష్మీనారాయణ, పిఈటి కృష్ణగౌడ్, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.